# డెత్ సెల్

యర్రంశెట్టి శాయి

చౌరస్తాలో నిలబడ్డాడు సురేష్. అన్ని వేపుల నుంచీ అన్నివేపులకూ జనంతోపాటు వాహనాలు కూడా దూసుకు పోతున్నాయ్. టైమ్ చూసుకున్నాడు సురేష్.

అయిదున్నర అవటానికి ఇంకో పదినిమిషాలుంది. అప్పుడే తన పక్కనుంచి వెళ్తోన్న యువతిని జాగ్రత్తగా చూశాడతను.

'36. 26. 32.' అనుకున్నాడు స్వగతంగా. కానీ ఆ మాట అతనికి తెలియకుండానే పైకి వినిపించడంతో ఆ యువతి చటుక్కున అతనివైపు కోపంగా చూసింది.

"ఏమిటంటున్నావు?" అంది ముఖంలోని అందాన్ని కొంచెం చెరిపేసుకుని.

సురేష్ చిరునవ్వు నవ్వాడు "36. 26. 32 మేడమ్!"

ఆమె ముఖం ఎర్రబడింది "ఏమిటీ?" అంది రోషంతో రెట్టిస్తూ.

"మెజర్‌మెంట్స్ మేడమ్....! మా ఫ్యాక్టరీలో సిలిండర్ మెజర్‌మెంట్స్".

ఆ యువతికి ఇంకేమనాలో తెలీలేదు.

"ఇడియట్..." అనేసి తన దారిన తను వడివడిగా నడుస్తూ పోయింది.

రెండు నిమిషాలలో మరో యువతి తన ముందునుంచి వెళ్లటం గమనించాడు.

"32. 24. 28" అనుకున్నాడతను.

ఆ యువతి కూడా జనంలో కలసిపోయాక మరోసారి టైమ్ చూసుకున్నాడతను.

ఇంకో రెండు నిమిషాలుంది . "ఎంత సేపయింది వచ్చి" వెనుకనుంచి వచ్చి అతని చేయి పట్టుకుంటూ అడిగింది తులసి.

"అరె రెండునిమిషాల ముందే ఎలా వచ్చేశావ్? మీ బాస్‌ని ఇవాళ్ళ నీ చేయి నిమరనిచ్చావా?" ఆశ్చర్యంగా అడిగాడతను.

"డోంట్ బి సిల్లీ" చిరుకోపంతో అందామె.

ఇద్దరూ బస్‌స్టాప్‌లో నిలబడ్డారు.

"ఇప్పుడేం చేద్దాం?" ఆలోచిస్తూ అడిగిందామె.

"అదే! ముందు మామూలుగా ముద్దులు పెట్టుకుని తరువాత మామూలుగా..."

"సురేష్" చిరాకుగా అంది తులసి.

"ఓ.కె. ఓ.కే! స్టాప్ చేశాను"

"ముందు ఈ అడ్రస్‌కెళ్దాం" తన బ్యాగ్‌లో నుంచి కాగితం తీస్తూ అడిగిందామె.

ఆమె వంకే ఆనందంగా చూశాడు సురేష్. తెల్లగా పోనీటెయిల్, కూలింగ్ గ్లాసెస్‌తో,

ఎవరూ ఆమెను మూడువందల యాభయ్ రూపాయల జీతం మీద పనిచేసే టైపిస్ట్ అనుకోరు. ఇంత అందమైన అమ్మాయి ప్రేమను పొందటం యింకా కలేనేమో అనిపిస్తూంటుంది అప్పుడప్పుడూ.

"కోఠీలో ఒక ఏజన్సీ వుంది. అక్కడికెళ్దాం" లిస్ట్ అంతా చూసి అందామె.

ఇద్దరూ బస్ ఎక్కారు. కండక్టర్ వచ్చాడతని దగ్గరకు.

"ఎక్కడికి?"

"కోఠీ, రెండు లేడీస్ టికెట్స్"

కండక్టర్‌కి అర్థం కాలేదు.

"లేడీస్ టికెట్లా?"

"అవును! అంటే వీటికి చార్జ్ లేడీస్ చెల్లిస్తారని అర్థం"

తులసి నవ్వుతూ బ్యాగ్‌లోనుంచి డబ్బు తీసి యిచ్చింది.

శ్రీనివాసా రియల్ ఎస్టేట్ అండ్ రెంటల్ ఏజన్సీస్ ఓ సందులో వుంది. టేబుల్ వెనుక ఓ లావుపాటి వ్యక్తి కూర్చుని వున్నాడు.

"మే ఐ కమిన్" అడిగాడు సురేష్.

"ప్లీజ్ కమిన్! హావ్ యువర్ సీట్స్"

ఇద్దరూ కుర్చీల్లో కూర్చున్నారు.

"ఇల్లు కావాలి" చెప్పాడు సురేష్.

"కొంటానికా? అద్దెకా?"

తులసి 'అద్దెకి' అని చెప్పేలోపలే సురేష్ "కొంటానికి..." అనేశాడు.

"ఎంతలో?"

"ఎంతలో వున్నాయ్?"

"లక్షన్నర నుంచీ పది లక్షల వరకూ వున్నాయి."

"లాభం లేదు. వెళ్దాం పద తులసీ..." అంటూ కుర్చీలోనుంచి లేవబోయాడతను.

ముసలతను కంగారుపడ్డాడు "మీకు ఎంతలో కావాలి?"

"కనీసం యాభయ్ లక్షల బంగళా..."

తులసి ఇంక లాభం లేదని కల్పించుకుంది.

"అద్దెకు చిన్న ఇల్లేమయినా వుంటే..."

అతను మరీ పజిల్ అయిపోయాడు.

"యాభయ్ లక్షల రేంజ్‌లో మంచి బిల్డింగ్ ఏదయినా కనిపించినప్పుడు మాతో చెప్పురుగాని. అంత లోపల అద్దెకు చిన్న ఇల్లు ఏదైనా"

"ఎంతలో?"

సురేష్ తులసి వంక చూశాడు. తులసి ఓ క్షణం ఆలోచించింది.

"వెల్... రెండువందల్లోపల"

"ఆల్‌రైట్! పాతిక రూపాయలు రిజిస్ట్రేషన్ ఫీజ్ కట్టండి"

"అంటే మీరు చూడబోయే ఇల్లు మా పేర రిజిస్ట్రేషన్ చేస్తారా"

"అదికాదు...." తడబడుతూ అన్నాడతను.

తులసి పాతిక రూపాయలు యిచ్చేసింది. ఓ రిజిష్టర్ తీసి "తమ పేరు?" అడిగాడతను.

"సురేష్"

"చిరునామా?"

"చిరునామా వుంటే ఈ పాతిక రూపాయలతో సినిమా కెళ్ళేవాళ్ళం"

అతని మాటలకు తులసికి నవ్వాగలేదు.

"ప్రస్తుతం వుండటం, ఏం చేస్తుంటారు?"

"కేరాఫ్ ఫుట్ పాత్! పగలయితే సరదాగా కబుర్లు చెప్పుకుంటూ రాత్రుళ్లయితే...." అతని మాటలు వింటూనే ముసలతను ముఖానికి చెమట తుడుచుకున్నాడు.

"సురేష్" అంది తులసి కోపంగా.

"ఎన్ని గదుల ఇల్లయితే సరిపోతుంది?"

"కనీసం పాతిక గదులుండాలి..."

తులసి కల్పించుకుంది చప్పున.

"ఒక గది, కిచెన్ వుంటే చాలు"

"ఏ ఏరియాల్లో?"

"బంజారాహిల్స్, జూబిలీహిల్స్, రెడ్‌హిల్స్...."

తులసి అందుకుంది మళ్ళీ.

"ఎక్కడయినా ఫర్లేదు. మరీ ఊరి బయట కాకుండా వుంటే చాలు."

"మీరెంతమంది మెంబర్స్?"

"మేమిద్దరమే" మళ్ళీ జవాబిచ్చాడతను.

"భార్యాభర్తలా?"

"కాదుగానీ వాళ్ళిద్దరి మధ్యా వుండాల్సినవన్నీ వున్నాయ్..."

తులసి అతని భుజం మీద లాగి కొట్టింది "ఇంకా పెళ్ళికాలేదు" అంది సిగ్గుపడుతూ.

"మరి ఒకే ఇంట్లో ఎలా వుంటారు?"

"ఒకే బెడ్‌మీద" అన్నాడతను.

తులసి అతి కష్టంమీద నవ్వాపుకుని అతనివేపు కోపంగా చూసింది.

"సురేష్"

"ఓ.కే.!ఓ.కే!" అన్నాడతను.

"సరే! ఓ పని చేయండి. ఆ ఇంటావిడ ఆడిగితే పెళ్ళి కాలేదని చెప్పకండి" అన్నాడతను "అలా చెప్తే మీకెవరూ ఇల్లివ్వరు."

"పెళ్ళి అంటే అంత యిష్టమా ఆవిడకు?"

అతని మాటలు ముసలాయన వినిపించుకోలేదు.

"మీకో ఇంటి అడ్రస్ యిస్తాను. వెళ్ళి ఓనర్ గంగాభవానీని కల్సుకుని నేను పంపించానని చెప్పండి."

"గంగా తేరీ పానీ మ్తైలీ..."

"ఆ ఇల్లు మీకు నచ్చినట్లయితే ఓ నెల అద్దె ఫీజుగా యివ్వాలి."

"మీకెందుకివ్వాలి?" అడిగాడు సురేష్.

"అది మా ఏజన్సీ రూల్" అనేసి ఓ కాగితం మీద ఇంటి ఓనర్‌కి ఉత్తరం రాయసాగాడు.

"ఈ లెటర్ తెచ్చినవారు నాకు గత అయిదు సంవత్సరాలుగా బాగా తెలుసు. ఎంతో మర్యాదగల కుటుంబంకి చెందినవారు. చాలా మంచితనం, నీతి నిజాయితీ, ధర్మం, జాలి మొదలయిన గుణాలు కలవారు. కనుక వీరికి...."

"ఇంకోటి కూడా రాయండి" అన్నాడు సురేష్.

"ఏమిటది?"

"ఇద్దరూ ఇంట్లో ఎక్కువసేపు వళ్ళు దాచుకోకుండా కష్టపడతారని" తులసికి ఎంత ప్రయత్నించినా నవ్వాగలేదు. ముసలాయన చిరాగ్గా చూశాడతనివైపు.

ఉత్తరం మడచి కవర్లో పెట్టి పైన అడ్రస్ రాసి సురేష్ కిచ్చాడు.

"ఏ సంగతీ మళ్ళీ రేపు చెప్పాలి."

"ఓ.కే.!"

ఇద్దరూ బయటికొచ్చారు. "నువ్వెళ్ళి ఈ ఇల్లు చూచి మాట్లాడిరా. నేను మా ఫ్రెండ్ విజయతో వెళ్ళి వాళ్ళింటి దగ్గర ఓ ఇల్లు ఖాళీగా వుందిట. చూచి వస్తాను."

"విజయంటే ఆ 28- 22-24 అమ్మాయా?"

తులసి కోపంగా వెళ్ళిపోబోయింది.

"ఓ.కే....ఓ.కే. మళ్ళీ నిన్నెప్పుడు కలుసుకోవాలి?"

"రేపు సాయంత్రం-అయిదున్నరకు అదే చౌరస్తాలో వెయిట్ చెయ్."

"ఇవాళ రాత్రికోసారి అలా యూనివర్శిటీ లాండ్‌స్కేప్ గార్డెన్‌కెళ్దామా?"

"నేన్రాను-మొన్నరాత్రి వాళ్ళెవరో మనల్ని అలా చూచినందుకే నేను తలెత్తుకోలేకుండా వున్నాను."

"అందుకే అసలు తలెత్తకూడదని చెప్పాను ముందే."

"హలో" అందో గొంతు ముద్దగా.

ఇద్దరూ ఆ గొంతు వపు చూశారు.

"హలో హలో హలో సురేష్...లాంగ్ లాంగ్‌టైమ్ లాంగ్ లాంగ్‌టైమ్" అన్నాడతను ఆనందంగా.

సురేష్ ఆప్యాయంగా అతని చేయి పట్టుకున్నాడు.

"ఓరి డార్క్ డెవిల్! నువ్వా?"

"అవును! సేమ్ ఓల్డ్‌డార్క్ డెవిల్! లాంగ్ లాంగ్ టైమ్...లాంగ్ లాంగ్ టైమ్" తూలుతూ అన్నాడు డార్క్‌డెవిల్.

"అవును! రెండేళ్ళయింది మనం మనూర్లో విడిపోయి."

తులసి డార్క్ డెవిల్ వంక చిరాగ్గా చూస్తోంది. అతని పాంటు అంతా మట్టి మరకలతో నిండి వుంది. అంతకుముందు కొద్ది నిమిషాల క్రితమే అతను రోడ్డుమీద పడి లేచి వుండవచ్చని ఇట్టే అర్థమయిపోయింది.

"ఈ బొమ్మ ఎవరు? హూ ఈజ్ దిస్ డాల్?" అడిగాడు డార్క్‌డెవిల్.

"లైఫ్ పార్టనర్..."

"టెరిఫిక్ ఫిగర్.. లైఫ్ పార్టనర్‌గానే కాదు. ఇంకే పార్టనర్‌గానయినా సరే! టెరిఫిక్ పార్టనర్‌గా రాణిస్తుంది."

తులసికి కోపం ముంచుకొస్తోంది.

"అఫ్‌కోర్స్.. అఫ్‌కోర్స్! ముఖ్యంగా.." అంటూ ఏదో చెప్పబోయాడు సురేష్. కానీ తులసి అతని కాలిమీద గట్టిగా తొక్కేసరికి.... "దట్సాల్...దట్సాల్" అన్నాడు.

"నువ్వెక్కడ జాబ్ చేస్తున్నావ్?" అడిగాడు డార్క్ డెవిల్.

"రోడ్స్ అండ్ బిల్డింగ్స్ డిపార్టుమెంట్."

"నువ్వెక్కడా?"

"నేనూ అక్కడే రోడ్స్ ఆండ్ బిల్డింగ్స్."

ఇదరూ నవ్వేశారు. అడ్రస్‌లు రాసుకున్నారు. తరచుగా కలుసుకోవాలని నిర్ణయించుకున్నారు.

"నా బస్ వచ్చింది, నేను వెళుతున్నాను" అంది తులసి.

"ఓ.కే.! ఓ.కే.! సీయూ టుమారో" అన్నాడు సురేష్. ఆమె బస్ ఎక్కింది.

డార్క్ డెవిల్ వెళ్ళిపోయాక తను దిల్‌షుక్‌నగర్ చేరుకున్నాడు సురేష్. గంగాభవాని ఇల్లు కనుక్కోవటం చాలా తేలికగా జరిగిపోయింది. ఆమె శ్రీనివాస్ ఏజన్సీస్ వాళ్ళు రాసిచ్చిన ఉత్తరం చదువుతుంటే తను ఆమెని చదవసాగాడు సురేష్. ఫిగర్ బావుంది కానీ కళ్ళు.... ఏం కళ్ళని? చేజింగ్. ఆ డేగ కళ్ళు 38-28-36. వయసు రఫ్‌గా అయితే 40.

సౌష్టవాన్ని బట్టి చూస్తే 36.

"ఇల్లు చూస్తారా?" అడిగిందామె.

"మీరు చూడనిస్తే....."

ఆమె సురేష్ వైపు ఓసారి ఆశ్చర్యంగా చూసి లోపలకు నడిచి వెనకవైపు నుంచి వచ్చి ప్రక్కనే వున్న వాటా తలుపు తెరిచింది.

సురేష్ ఆ గదీ, కిచెన్ చూశాడు.